క్లుప్తంగా

సారా ఊట ధ్వంసం


మొట్లచేను అటవీ ప్రాంతంలో సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కుప్పంరూరల్: కుప్పం, తమిళనాడు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో సారా ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు చెప్పారు. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు, తమిళ సరిహద్దు పోలీసులు కలసి కుప్పం మండలం, మొట్లచేను సరిహద్దుల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి దాచి ఉంచిన ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో కుప్పం పోలీసులతో పాటు తమిళనాడు పోలీసులు ఉన్నారు.

బ్యాగుల పంపిణీ


బ్యాగులను పంపిణీ చేస్తున్న కో–ఆర్డినేటర్

సదుం: స్థానిక మహాత్మా జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బ్యాగులను ఎంఐఎస్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జయప్రకాష్ (ఎస్ఎస్ఏ, చిత్తూరు) శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. ఎంఈఓ–2 దామోదర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24 నుంచి పొలం పిలుస్తోంది

పుంగనూరు: ఈనెల 24 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఫయాజ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఈనెల 31 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొలాల వద్దకు అధికారులు వెళతారని తెలిపారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి, వారితో మమేకమయ్యే కార్యక్రమం చేపడతామన్నారు.

శ్వాసకోశ వ్యాధితోనే మృతి


గ్రామంలో విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతరావు

సదుం: మండలంలోని జాండ్రపేటలో సభాపర్విన్(04) శ్వాసకోశ వ్యాధితోనే మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావు తెలిపారు. గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్నారి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీష, సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, శిఖామణి పాల్గొన్నారు.


ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

పుంగనూరు: ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించి, సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈనెల 26 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించి, 30వ తేదీన గ్రామసభ నిర్వహిస్తామన్నారు. 23 పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి, పారదర్శక పాలన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మంత్రి రామానాయుడు కుప్పం రాక రేపు

కుప్పం: రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 23 తేదీ కుప్పం రానున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు కుప్పం బ్రాంచ్ కెనాల్ టెక్ ఆఫ్ పాయింట్, కే1 పంపింగ్ హౌస్‌ను తనిఖీ చేస్తారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంకాలం కుప్పం నుంచి రైల్లో విజయవాడకు వెళతారని ఆయన తెలిపారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఈఓ, నేతలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అక్టోబర్ 4నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికలను టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, ఈఓ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఈఓ ఏకాంబరం అమ్మవారి శేషవస్త్రాన్ని కప్పి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. దసరా మహోత్సాలకు హాజరుకావాలని ఈఓ కోరినట్లు పేర్కొన్నారు.

బాబూ.. ప్రత్యేక బడ్జెట్ ఏదీ?

- వంద రోజుల్లో కుప్పంలో ఒక్క పని లేకపోయా..
- హడావుడి తప్ప జరిగింది శూన్యం
- వంద ఏకరాల్లో గ్రానైట్ పరిశ్రమ ఏదీ?
- ఊసేలేని కుప్పం హామీలు


కుప్పం పట్టణం

కుప్పం: కుప్పం అభివృద్ధిపై ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి ప్రజలకు మారని బాబుగా గుర్తుండిపోయారు. 35 ఏళ్లుగా కుప్పం ప్రజలకు మాయమాటలు చెబుతూ వరుస విజయాలు సాధిస్తున్నా..అదే బాటలో 2024 ఎన్నికల్లో ఆచరించి మళ్లీ గెలిచారు. ఈసారి ప్రజలకు నమ్మలేని హామీలు ఇచ్చారు.. తీరా అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్నా కుప్పం అభివృద్ధి పట్ల ఒక్క పని ప్రారంభం కాలేదు.. కేవలం అధికారులతో సమీక్ష, సమావేశాలు, ఫిర్యాదుల స్వీకరణ, ప్రణాళికలు సిద్ధం వీటితోనే 100 రోజులు కాలయాపన జరిగిపోయింది.

ప్రపంచ స్థాయిలో కుప్పం

కుప్పంను అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్నా కుప్పం అభివృద్ధి పేపర్లకే పరిమితమైందేగానీ అమలుకు నోచుకోలేదు. ప్రత్యేక బడ్జెట్, కుప్పం మున్సిపాలిటీకి రూ.250 కోట్ల నిధులు కేటాయింపు, ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి, ప్రతి పొలానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. సాధ్యంకానీ హామీలతో కుప్పం ప్రజలను మళ్లీ బాబు బోల్తా కొట్టించాడు. 2017లో ఆగిన రింగ్ రోడ్డుకు రూ.100 కోట్ల నిధులు విడుదల చేసి పూర్తి చేస్తామని హామీ ఏమైంది. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు టీడీపీ నాయకుల తప్పిదానికి ఆగిపోయింది. వంద పడకల ఆస్పత్రిని 400 పడకల ఆస్పత్రిగా మారుస్తానన్నారు. కార్మికులు అధికంగా ఉన్న కుప్పం ప్రాంతంలో 100 ఎకరాల్లో గ్రానైట్ పరిశ్రమ స్థాపిస్తాం, పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు ఫోర్‌లేన్ హైవే నిర్మిస్తాం, ప్రైవేట్ ఉద్యోగులకు, చిరు వ్యాపారస్తులకు, లాయర్లు, జర్నలిస్టులకు ప్రత్యేకంగా హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసి కాలనీ ఇల్లు ఇస్తాం ప్రతి మహిళకు రెండు పాడి ఆవులు, పాల ఉత్పత్తికి దాణా, గడ్డి కటింగ్ మిషన్, షెడ్డు సబ్సిడీ కింద రైతులకు అందజేస్తాం, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి డిగ్రీ కళాశాలకు అనుసంధానం చేస్తామన్నారు. బెంగళూరుకు అనుసంధానంగా కుప్పం పట్టణం, సజ్జాపురా నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తాం అన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అటవీ ప్రాంతంలో రోడ్డు మార్గం వేయాల్సి ఉంది. ఏ హామీలు ఇంతవరకు అమలు చేసిందిలేదని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పలమనేరు నుంచి ఫోర్‌వే చేయాల్సిన రోడ్డు

వంద రోజుల్లో జరిగింది..

కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఏర్పాటు చేసి, ప్రాజెక్టు అధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించారు. ప్రత్యేకంగా కడ కార్యాలయం 19 మంది సిబ్బందిని నియమంచారు. కుప్పం అభివృద్ధి పట్ల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్, పీడీలు సమీక్ష, సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేస్తుంటారు. అంతేకాకుండా ప్రతి సోమవారం కడ పీడీ, గురువారం కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక పేరిట ఫిర్యాదు స్వీకరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ పోటాపోటీగా మున్సిపాలిటీలో వార్డు బాట పేరిట ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రచార ఆర్భాటాలు తప్పించి వంద రోజుల్లో సాధించింది శూన్యమని కుప్పం ప్రజలు మండిపడుతున్నారు.


బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శాంతి మార్గంలో నడవాలి

రొంపిచెర్ల: విద్యార్థులు శాంతి మార్గంలో నడవాలని గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్.బాబు అన్నారు. ఆయన శాంతి దినోత్సవంలో భాగంగా శనివారం రొంపిచెర్ల కేజీబీవీ, బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అందరూ శాంతి మార్గంలో నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం సుజాత, లోకనాథరెడ్డి, మునిలక్ష్మి, జ్యోతి, విద్యావేత్త రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రజావేదిక రేపు

గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామంలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొంటారని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

108లో ప్రసవం


108లో గంగభవానితో సిబ్బంది

పుంగనూరు: 108 వాహనం మగబిడ్డకు ప్రసవ కేంద్రంగా మారిన సంఘటన శనివారం జరిగింది. చౌడేపల్లె మండలంలోని ఎ.కొత్తకోటకు చెందిన గురుమూర్తి భార్య గంగాభవాని ఉదయం పురిటినొప్పులతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు మదనపల్లెకి రెఫర్ చేశారు. దీనిపై 108 సిబ్బంది పైలట్ గోవర్ధన్, ఈఎంటీ నాగభూషణం, గంగభవాని కుటుంబసభ్యులను హుటాహుటిన 108లో తీసుకొని మదనపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని భీమగానిపల్లి వద్ద గంగభవానీకి నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డను క్షేమంగా తీసుకుని వెనుదిరిగి స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బందిని గంగాభవాని కుటుంబసభ్యులు అభినందించారు.

అభివృద్ధికంటే గొప్పలే ఎక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వి.కోట: చేసింది చీమంత, గొప్పలు చెప్పుకునేది కొండంత అన్నట్లుంది పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరిస్థితి. శనివారం మండలంలో కుంబార్లపల్లి పంచాయతీలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలతో మమేకమై ప్రభుత్వ లోగోలను ప్రతి ఇంటికి అతికించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు కొనసాగిస్తామని, గ్రామీణ రహదారులకు తిరిగి మహర్దశ కల్పిస్తామని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయినా ఎటువంటి అభివృద్ధి చేయలేదని, గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను కూడా కొనసాగించలేదని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని ప్రజలు మండితున్నారు.

శాంతినగర్‌లో పాముల బెడద

పుంగనూరు: మండలంలోని శాంతినగర్‌లో పాములు, విష పురుగులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. శనివారం స్థానిక ఎస్‌డీపీఐ నాయకులు ఈ సమస్యలపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. వీధి లైట్లు, తాగునీరు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రూపేష్

చౌడేపల్లె: వాసవి ఆర్యవైశ్య సేవా కమిటీ లలితా మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో 185 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మదనపల్లె శ్రీహిత మల్టీ స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పిటల్, అడ్వాన్స్ ఆనో రెక్టిల్ సెంటర్ వారి సహకారంతో స్థానిక కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 135 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ ఇక్కలూరి రూపేష్ వైద్యసేవలందించగా బిస్ అమరనాథ్ మందులను పంపిణీ చేశారు.

వరద బాధితులకు విరాళాలు

పలమనేరు: విజయవాడ వరద బాధితుల సాయం కోసం స్థానిక బేరి సంఘ నేతలు రూ.50 వేల చెక్కును స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్‌ఎఫ్‌కు శనివారం అందజేశారు. మరోవైపు స్థానిక ఏపీఎన్జీఓలు రూ.10వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు. కార్యక్రమాల్లో బేరి సంఘ నాయకులు కుమార్, జగన్నాథం, సోమశేఖర్, మల్లి, బాలాజి పాల్గొన్నారు.

28 నుంచి కీలపట్లలో పవిత్రోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు శనివారం టీటీడీ అధికారులు తెలిపారు. 27న సాయంత్రం పుణ్యాహవచనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 28వ తేదీ రక్షబంధనం, పవిత్ర ప్రతిష్ఠ, శేయాధివాసం, 29న ఉదయం స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, సాయంత్రం పవిత్ర హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 30న ఉదయం హోమాలు, సాయంత్రం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

పుష్ప శోభితం !

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం జరిగిన పుష్పపల్లకి ఉత్సవానికి ఆలయం పుష్పశోభితమైంది. విదేశీ పుష్పాలు, పలు కరాల ఫలాలతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అన్వేటి మండపం, ధ్వజస్తంభం, ఆలయ పరిసరాలు, సుపథ మండపం, ఆలయ విమాన గోపురాన్ని ముస్తాబు చేసి పుష్పతోరణాలు కట్టారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయ పరిసరాలు మొత్తం పుష్పాలంకారంలో కనువిందు చేశాయి.


పుష్పాలంకారం

వేర్వేరు ప్రాంతాల్లో బాణసంచా సీజ్



పెద్దపంజాణి : సీజ్ చేసిన టపాసులు, పలమనేరులో టపాసులను సీజ్ చేస్తున్న పోలీసులు

పెద్దపంజాణి: అనుమతులు లేకుండా విక్రయించడానికి నిల్వచేసిన రూ.3,47,750 విలువైన టపాసులను సీజ్ చేసినట్లు ఎస్ఐ సహదేవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు నిడిగుంటకు చెందిన వెంకటరమణ కుమారుడు నాగేశ్వరయ్య ఇంటిలో సోదాలు చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా విక్రయించడానికి సిద్ధంగా ఉన్న టపాసులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విలువ రూ.3,47,750 ఉంటుందని వివరించారు. అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరమన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని కొత్తపేట బొరుగుల బట్టీ వీధిలోని వెంకటేశం శెట్టి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన టపాసులను పోలీసులు శనివారం సీజ్ చేశారు. ఇటీవల గంగవరం వద్ద ఇంట్లో టపాసులు తయారుచేస్తూ దంపతులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఒక ఇంట్లో టపాసులు నిల్వ ఉన్నట్టు తెలుసుకుని పోలీసులు దాడి చేశారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈఓ ఇందిర

రొంపిచెర్ల: క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ ఇందిర శనివారం బహుమతులను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 8 ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించామని తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశామని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో కూడా పాల్గొంటాయని అన్నారు. వాలీబాల్ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ బాలికల విభాగాల్లో కేజీబీవీ విద్యార్థులు, వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో రొంపిచెర్ల బాలుర విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజయం సాధించారని తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు లోకనాథరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యం


క్రీడల్లో విద్యార్థులు చేస్తున్న విన్యాసాలు

కుప్పంరూరల్: క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. శనివారం కుప్పం పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని, క్రీడల ద్వారా పోటీతత్వం, శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం, ఏకాగ్రత సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. చైర్ పర్సన్ శాంతానాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ దమయంతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వివేకానంద

పుంగనూరు: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలు, నేరాలు గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వేలూరు విట్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వివేకానంద సూచించారు. శనివారం గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వివేకానంద మాట్లాడుతూ ఫేక్ ఐడీలు, ఇన్‌స్టాగ్రామ్‌లు, ఫేస్‌బుక్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయన్నారు. ఈ మోసాల బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రఘు, నరసింహులు, సురేష్‌రెడ్డి, ప్రకాష్‌రావు, శారద, భారతి, విజయవాణి, సలీం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ



పలమనేరులో అవగాహన ర్యాలీలు

పలమనేరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై స్థానిక మున్సిపల్ అధికారులు, కార్మికులు, సచివాలయం, మెప్మా సిబ్బంది శనివారం బ్యానర్లతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ మమతారాణి ఆధ్వర్యంలో అక్కడి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు చేసుకోవాలి


ఈక్రాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏడీ

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయశాఖ పరిధిలోని రైతులు తమ పంటల ఈక్రాప్ నమోదు ఈనెల 23వ తేదీలోపు పూర్తిచేసుకోవాలని ఏడీ శివకుమార్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని పాళెంపల్లెలో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఈక్రాప్‌పై అవగాహన కల్పించారు. ఏడీ మాట్లాడుతూ ఇంకా 3,571 మంది రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వ బీమా, పంట నష్టం అందదన్నారు.

ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందాలి


గర్భిణులకు సామూహిక సీమంతం

వి.కోట: ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మాధవిలత తెలిపారు. శనివారం మండలంలోని ఓగు, కొంగాటం, కుంబార్లపల్లి పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లత, రాధిక, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి వెలుగుజాడ గురజాడ



డిగ్రీ కళాశాలలో గురజాడకు నివాళి, మాట్లాడుతున్న హెచ్ఎం ఉషారాణి

పలమనేరు: రాజస్థానాలలో రాజుల చుట్టూ తిరిగిన సాహిత్యాన్ని ప్రజల మధ్యకు తీసుకొచ్చిన వెలుగుజాడ గురజాడని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.బాబు తెలిపారు. అక్కడి తెలుగు విభాగాధిపతి ఈ వాసు సౌజన్యంతో గురుజాడ అప్పారావు 162వ జయంతిని శనివారం నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం ఆధ్వర్యంలో స్థానిక కళామందిరంలోనూ చేశారు. గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు గురజాడ రచనలను పరిచయం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుబ్బయ్యానాయుడు, పుష్ప, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

పుంగనూరు: పట్టణంలోని లీనార్డ్ హైస్కూల్‌లో గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం హెచ్ఎం ఉషారాణి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డి, హరికథ భాగవతార్ నాగభూషణరావు పాల్గొని గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తెలుగుభాషాభివృద్ధికి గురుజాడ చేసిన సేవలను కొనియాడారు. శ్రీరాములురెడ్డి, ఎర్రప్ప యాదవ్, నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పలమనేరు కళామందిరంలో నివాళి